# మనిషేనా?

●

శ్రీ కాళ్లకూరి దయానిధిరావు

లక్ష్మి నీళ్లుకారుతూన్న తడిబట్టలతో, ఒణుకుతోన్న ఒళ్లుతో తెచ్చిన నీళ్లబిందె దించుకుంటోంది.

ఆ దృశ్యంమాత్రం చూచి శంకరం భరించలేకపోయాడు.

'కాలవకి వెళ్లావేమిటి?' అన్నాడు, శంకరం మండుతూన్న చూపులతో.

'అవునండి వెళ్లాను. శుభ్రంగా తలతడుపుకుని, నీళ్లుపోసుకొని...'

ఇంకా లక్ష్మి పూర్తిచెయ్యకముందే శంకరం అందుకున్నాడు. 'నీకు బుద్ధివుందా లేదా. ఎన్నిఏళ్లువస్తే ఏంకార్యం? తలనొప్పి, ఒళ్లునొప్పులూ, అరికాళ్లుపోట్లూ అనుకుంటూ రాత్రి కంటికి కునుకులేకుండా మూలిగావు. కొంచం వేడికూడా తగిలిందాయె. ఆ నీళ్లలోపడ్డ ఎలకలా తయారుకాకపోతేనేం...కొంచెం పొడి బట్టలుకట్టుకుని వంటచెయ్యకూడదూ?'

'ఛా, దరిద్రం, ఊరుకోండి...'

'నీకు తోచదు, చెబితే తెలియదు. అనుభవించు ఎవరికి కావాలి'

ఆపూటకి ఎల్లాగో వంటచేసి పెట్టింది. సాయంత్రం అయ్యేటప్పటికి ఒళ్లు తెలియని జ్వరం, నిప్పులా కాగుతూన్న శరీరంతో లక్ష్మి రగ్గుకప్పుకు పడుకుంది.

'భేష్! జ్వరంకూడా వచ్చిందీ. ఇంకేంపనివుంది మనకి? మందు సీసాలు తోలవడం, ఆస్పత్రులు చుట్టూ తిరగడమూ'

'మనకి చేసేవాళ్లెవరు? అమ్మ అన్నయ్యదగ్గరుంది. రమ్మని వ్రాయ నేమిటి? ఏముంది, రేపు ఉత్తరంముక్క వ్రాసి పారవేస్తే ఎల్లుండి అందుతుంది. అవతల ఎల్లుండి ఏవేళకో ఆవేళకి వచ్చిపడుతుంది'

'వ్రాయండిబాబూ, మీయిష్టం...'

'మహాతల్లివి! జన్మంతా ఒక్కలాగ వెడుతోంది. నీకంటె, అలంకరించి ఆబట్టల షాపుల్లోపెట్టే స్త్రీ విగ్రహాలు మేలు.'

మౌనమే ఒకపెద్ద 'డిఫెన్సు' అనుకుంది కాబోలు లక్ష్మి మాట్లాడలేదు. కొంచెంసేపాగి 'డాక్టరుగారిని తీసుకువద్దురూ' అంది లక్ష్మి నీరసపుగొంతుకతో. 'ఊ' అని విసుగుకుంటూ శంకరం వెళ్లిపోయాడు.

తర్వాత సంగతి—అనుకున్నరోజుకే అమ్మవచ్చింది. ఒకనెలదాకా లక్ష్మి మంచం దిగలేదు...